సిద్దిపేట మండల పరిధిలోని పుల్లూరులో కనక దుర్గామాత ఉత్సవాల్లో పాల్గొన్న మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



మాంకాల నవీన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

## అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

■ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు -■ మృతుల కుటుంబాలకు పరామర్శ

సిద్దిపేట కమాన్/నంగునూరు, ఆగస్టు 10 : అధైర్య పడొద్దు.. ధైర్యంగా ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని సంతోషి మాత ఆలయ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మాంకాల నవీన్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శనివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పట్టణానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు నందు భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మున్సిపల్ ఉద్యోగి సామల ఐలయ్యను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నంగునూరు మండలం రాంపూర్‌కు చెందిన పార్టీ యువజన విభాగం నాయకుడు ఎండీ గఫూర్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబంతో పాటు అదే గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లయ్య తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

**నారాయణరావుపేటలో..**

నారాయణరావుపేట, ఆగస్టు 10 : మండల కేంద్రంలోని పలువురి మృతుల కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. పార్టీ సీనియర్ నాయకుడు రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నర్సన్న గారి శేఖర్ తల్లి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ సీనియర్ కార్యకర్త గంటా శేఖర్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని, గ్రామ మహిళా సమాఖ్య సీఏ లావణ్య అత్తమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబాన్ని హరీశ్‌రావు పరామర్శించి ధైర్యం చెప్పారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యం

మల్లంపల్లి రైతు వేదికలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- పాడి పరిశ్రమ, చేపలు, పండ్ల తోటలు, వాణిజ్యపంటలపై రైతులు దృష్టి సారించాలి
- గౌరవెల్లికి ప్రాజెక్ట్‌కు రూ.431కోట్లు నిధులు మంజూరు
- రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- రామవరం, మల్లంపల్లి రైతు వేదికల్లో వ్యవసాయ అనుబంధ రంగాల అవగాహన సదస్సు

అక్కన్నపేట, ఆగస్టు 10: రైతుల సంక్షేమం, శ్రేయస్సే లక్ష్యమని, ఇందుకోసం వ్యవసాయ, అనుబంధ రంగాల బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని రామవరం, మల్లంపల్లి గ్రామాల్లోని రైతు వేదికల్లో వ్యవసాయ అనుబంధ రంగాల పథకాల అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడారు. రైతులు వరి, మక్కజొన్న, పత్తి పంటల సాగుతో పాటు పాడి పారిశ్రమ, చేపలు పెంపకం, పండ్ల తోటలు, కూరగాయాల సాగు, వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించి అదనపు ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. ఇందుకు ప్రభుత్వ పరంగా పూర్తిగా సహకారం అందిస్తామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ తుది దశ పనుల కోసం రూ. 431.50 కోట్లు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలోనే ప్రాజెక్ట్ పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఇక నుంచి రైతులకు సాగులో సలహాలు, సూచనలు చేసేందుకు వ్యవసాయ శాఖ, అనుబంధ రంగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. అంతకు ముందు మంత్రి పెద్దమ్మ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వనమహోత్సంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో జయరాం, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి పర్యటన

చేర్యాల, ఆగస్టు 10 : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం చేర్యాల పట్టణంలో పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని రేణుక గార్డెన్స్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించనున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరైన లబ్ధిదారులు ఆధార్‌కార్డులతో హాజరై సమావేశానికి రావాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, హాజరుకావాలని కోరారు. ఆయనతో మండల ప్రధాన కార్యదర్శి కోతి దాసు తదితరులు ఉన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

ప్లాస్టిక్ రహిత విలేజ్ బ్యాగును ప్రారంభిస్తున్న చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఆగస్టు 10 : ప్లాస్టిక్ రహిత భారతదేశ నిర్మాణంలో గ్రామాల్లోని ప్రజలు భాగస్వాములు కావాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లిలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్లాస్టిక్ రహిత కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విలేజ్ బ్యాగును ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించడంతో ప్రజలకు వచ్చే ప్రమాదాన్ని నివారించ వచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎర్త్ ఫౌండేషన్ సభ్యులు భాస్కర్, అంజాగౌడ్, మహిపాల్, గౌతమి, రాజు, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

## కదిలిన యంత్రాంగం.. చెత్త సేకరణలో అధికారులు

తుక్కాపూర్ రోడ్డుపై చెత్తను తొలిగించిన సిబ్బంది

తొగుట ఆగస్టు 10 : మండల కేంద్రంలోని తుక్కాపూర్‌లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడనే ఉండడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డు పక్కనే చెత్తాచెదారం ఉండడంపై నమస్తే తెలంగాణ పత్రికలో వచ్చిన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. అక్కడ పారిశుధ్య చర్యలు చేపట్టడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## గురుకులంలో విద్యార్థికి అస్వస్థత

దవాఖానలో చికిత్స చేస్తున్న డాక్టర్లు

చేర్యాల, ఆగస్టు 10 : పట్టణంలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(కళాశాల)లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అరుణ్ శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురయ్యాడు. సకాలంలో అరుణ్‌కు వైద్యం అందించేందుకు గురుకులంలో విధులు నిర్వహించే వైద్యురాలు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో విద్యార్థి ఊపిరి పీల్చుకోలేక తీవ్ర ఇబ్బంది పడ్డాడు. గమనించిన విద్యార్థులు అధ్యాపకులకు సమాచారం ఇవ్వడంతో వారు బైక్‌పై స్కారు దవాఖానకు తరలించడంతో వైద్యులు చికిత్స చేశారు. సకాలంలో దవాఖానకు చేరుకోకపోతే అరుణ్‌కు ప్రాణాపాయం జరిగేదనని తెలిసింది. ఈ విషయమై ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ పుల్లయ్యను వివరణ కోరగా అరుణ్ బాగానే ఉన్నాడని తెలిపారు.

## దూసుకెళ్లిన కంటైనర్.. 15 గొర్రెలు మృతి

ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాస్

గజ్వేల్, ఆగస్టు 10: రాజీవ్ రహదారిని దాటుతున్న గొర్రెలపైకి కంటైనర్ దూసుకెళ్లడంతో 15గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొడకండ్లలో శనివారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన కోర మల్లయ్య, బీడ భూమయ్యకు చెందిన గొర్రెలను మేత కోసం రోడ్డు దాటిస్తున్న క్రమంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ గొర్రెలపైకి దూసుకెళ్లింది. దీంతో 15గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి చేరుకొని ఎస్సై శ్రీనివాస్ వివరాలు సేకరించారు. ప్రమాదంలో సుమారు రూ.4లక్షల నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

తొగుట పోలీస్ స్టేషన్‌లో మొక్క నాటుతున్న సీఐ లతీఫ్

తొగుట, ఆగస్టు 10 : మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తొగుట సీఐ లతీఫ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట సీపీ అనురాధ ఆదేశాల మేరకు శనివారం తొగుట సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై రవికాంత్‌రావు, పోలీస్ సిబ్బంది రాంరెడ్డి, యాదగిరి, మధుసుదన్‌రెడ్డి, మల్లేశం, రాజు, సంతోశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు

## పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 10 : రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకోవాలని ఏఈవో శివరాం కోరారు. ఈనెలాఖరు వరకు రైతులు నమో దు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. రైతులు పంట వివరాలు, సర్వే నంబర్‌తో సమాచారం ఇవ్వాలన్నారు.

## అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

మిరుదొడ్డి, ఆగస్టు 10 : మిరుదొడ్డికి చెందిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మద్దెల రాజేశం, ఉపాధ్యక్షులుగా దార స్వామి, ర్యాకం పెద్ద బాబు, ప్రధాన కార్యదర్శిగా అస్క స్వామి, సంయుక్త కార్యదర్శులుగా పొడేటి భిక్షపతి, మద్దెల రాజయ్య, కోశాధికారిగా మద్దెల స్వామి, సాంస్కృతిక కార్యదర్శిగా నర్మాల ఆంజనేయులు, సలహదారులగా దార మల్లయ్య, మద్దెల అంజయ్య, ర్యాకం నర్సింహులు, నక్క రాజయ్య, మద్దెల మల్లయ్య, మద్దెల చంద్రం, మద్దెల మంకయ్య, పొటేడి మల్లయ్య, నర్సింహులును ఎన్నుకున్నారు.

## పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గం

కోహెడ, ఆగస్టు 10 : మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ పద్మశాలీ సంఘం నూతన అధ్యక్షుడిగా వేముల నరేశ్ ఎన్నికయ్యారు. శనివారం జరిగిన సంఘ కార్యవర్గ సమావేశంలో ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా గాదాసు భాస్కర్, కోశాధికారిగా ఈగ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు కొక్కుల రమేశ్, శ్యామల సంతోశ్, వేముల శ్రీపాల్, భూర మల్లికార్జున్, కొక్కుల మహేందర్, వెల్దండి శంకర్, బాలాజీ, గాదాసు బాబు, రాజు ,కొక్కుల భానుచందర్, రమేశ్, కొక్కుల శ్రీకాంత్ ఉన్నారు.

## మర్వడగ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



కొండపాక (కుకునూరుపల్లి), ఆగస్టు 10 : కొండపాక మండలంలోని మర్వడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రాన్ని శనివారం కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియాచంద్ర శేఖర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ, కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు.

## విద్యుత్ షాక్‌తో పాడిగేదే మృతి

కొమురవెల్లి, ఆగస్టు 10 : మండల పరిధిలోని తపాస్‌పల్లిలో విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన పుట్ట రమేశ్ పాడి గెదేను శుక్రవారం సాయంత్రం వ్యవసాయ భూమి వద్ద తాడుతో కట్టి శాడు. ప్రమాదశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద విద్యుత్ షాక్ తగిలి పాడిగెదే మృతిచెందింది. పాడిగెదే విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## మాజీ ఎమ్మెల్యే కృషితోనే గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తి

హుస్నాబాద్, ఆగస్టు 10: హుస్నాబాద్ మెట్ట ప్రాంత వరప్రదాయిని గౌరవెల్లి రిజర్వాయర్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ కృషితోనే 98శాతం పూర్తయిందని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శనివారం హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. 2007నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నపాటి చెరువును తలపించేలా కట్ట నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేసిందని, అనంతరం అప్పటి సీఎం కేసీఆర్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి కేవలం ఎనిమిదేండ్లలో రిజర్వాయర్‌ను పూర్తి చేయించారన్నారు. ఇందులో సతీశ్‌కుమార్ పాత్ర ఎంతో ఉందన్నారు. నిర్వాసితులను ఒప్పించి వారిని అన్ని విధాలుగా ఆదుకొని కట్ట, పంపుహౌస్ నిర్మాణం పూర్తి చేయించి ట్రయల్‌రన్ చేశారన్నారు. కాలువల నిర్మాణానికి కూడా రూ.200కోట్ల నిధులు కేటాయించగా ఎన్నికలు రావడంతో ఆగిపోయాయన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాల్వల నిర్మాణానికి నిధులు కేటాయించడం హర్షణీయమని, అయితే సత్వరమే కాల్వల నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## వెండి చీర అలంకరణలో వాసవి మాత

సిద్దిపేట టౌన్, ఆగస్టు 10 : సిద్దిపేట మేరు చక్ర వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ వారికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మ వారు వెండి చీరలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వైశ్యభవన్ అధ్యక్షుడు బాలరాజేశం, శ్రీకాంత్, గంప కృష్ణమూర్తి, గంప శ్రీనివాస్, అంజయ్య, రాజేందర్, లక్ష్మణ్, వాణి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

హుస్నాబాద్, ఆగస్టు 10: భౌతిక, రసాయనశాస్త్ర ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయుల ఫోరం నాయకులు కోరారు. శనివారం హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు సాదత్ అలీ, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, రాజమౌళి, మన్మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, భిక్షపతి, రాజేందర్, ఆత్మలింగం, మార్కండేయ, రవీందర్, పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

## కాలినడకన కొమురవెల్లి క్షేత్రానికి అడిషనల్ కలెక్టర్

కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల, ఆగస్టు 10 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారిని సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం కాలినడకన వచ్చి దర్శించుకున్నారు. అడిషనల్ కలెక్టర్‌కు ఆలయ ఈవో బాలాజీ, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మల్లన్న క్షేత్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న వసతులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు సురేందర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### వర్గల్ ఆలయాల్లో భక్తుల పూజలు

సరస్వతీమాతను దర్శించుకుంటున్న ఎఫ్‌డీసీ కమిషనర్ ప్రశాంతి

వర్గల్, ఆగస్టు 10 : వర్గల్‌లోని సరస్వతీ అమ్మవారిక్షేత్రంతోపాటు నాచగిరి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అటవీ శాఖ అదనపు కమిషనర్ ప్రశాంతి దంపతులు అమ్మవారిని దర్శించుకొన్నారు. నాచగిరిక్షేత్రంలో స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పలువురు భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని ఈవో అన్నపూర్ణ తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చేర్యాల, ఆగస్టు 10 : పట్టణానికి చెందిన నిరుపేద బక్క కనకరాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను శనివారం చేర్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు దీపాంజలి, పెద్ది తిరుపతిరెడ్డి పరామర్శించి చెరో రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మహేశ్వరి, మంజుల, రాజలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

బియ్యం బస్తాను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తొగుట, ఆగస్టు 10 : మండల పరిధిలోని కాన్గల్ గ్రామానికి చెందిన బత్తు కిష్టయ్య ఇటీవల మృతి చెందాడు. శనివారం మాజీ వైస్ ఎంపీపీ బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ నాయకులు బొమ్మాడ కరుణాకర్, లింగుపల్లి బాలరాజు, పరుశురాములు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు

## సుప్రీం కోర్టు న్యాయవాదికి సన్మానం

సుప్రీం కోర్టు న్యాయవాది సిద్ధార్థను సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 10 : సుప్రీం కోర్టులో తెలంగాణ ప్రభుత్వం నియమించిన న్యాయవాది సిద్ధార్థ లూద్రాను ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ శనివారం ఢిల్లీలో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు అనుకూలంగా తీర్పు ఇచ్చినందుకు గుర్రాల శ్రీనివాస్,న్యాయవాదులు సంఘం నేత కొమ్ము ప్రవీణ్‌కుమార్ తదితరులు న్యాయవాది సిద్ధార్థ లూద్రాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మోహన్, యాదగిరి, శ్రీనివాస్‌లు ఉన్నారు.

### యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు

జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిద్దిపేట, ఆగస్టు 10 : యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట యాదగిరి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడిన ఘనత యూటీఎఫ్‌దే అన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో దేవులపల్లి గిరిబాబు, నగేశ్, శివలింగం, గ్యార ప్రవీణ్, రాకేశ్, శివుడు, రాజయ్య, రమేశ్, రాములు, ఇస్మాయిల్, రవీందర్, రాంచంద్రం,రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

## 'ధూళిపాల' మృతి సీపీఐకి తీరనిలోటు

హుస్నాబాద్, ఆగస్టు 10: సీపీఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి, సీనియర్ నాయకుడు ధూళిపాల సీతారామచంద్రరావు మృతి పార్టీకి తీరని లోటు అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఐదు దశాబ్దాలుగా పార్టీలో సేవలందిస్తూ హైదరాబాద్‌లోని ముగ్దుంభవన్‌లో కార్యదర్శిగా పని చేసిన ఆయన మృతి చెందడం రాష్ట్రంలోని నాయకులు, కార్యకర్తలందరూ శోకసంద్రంలో మునిగారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ నాయకులు సంజీవరెడ్డి, కొమురయ్య, సుదర్శనాచారి, రాజ్‌కుమార్, గూడ పద్మ, రజిని, బాల్‌రెడ్డి, విజయ, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ రణం జ్యోతి

రాయపోల్, ఆగస్టు 10 : దౌల్తాబాద్ మండలంలోని చెట్ల నర్సంపల్లికి చెందిన నంది నీగౌడ్‌కు రూ.35వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం మాజీ జడ్పీటీసీ రణం జ్యోతీ శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో చెట్లనర్సపల్లి మాజీ సర్పంచ్ మేమ జనార్దన్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సత్యం, సీనియర్ నాయకులు స్వామి పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి

చేర్యాల, ఆగస్టు 10 : గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేర్యాల సీఐ శీను సూచించారు. పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు శ్యాంసుందర్, కనకయ్య, హరిప్రసాద్, భిక్షపతి, కొమురవెల్లి పోలీసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడి ఆత్మహత్య

బెజ్జంకి, ఆగస్ట్ 10: మండలంలోని కల్లెపల్లి గ్రామానికి చెందిన బొలమల్ల నాంపల్లి (65) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. నాంపల్లి కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడని తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ దవాఖానాకు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## కాళేశ్వర జలాలతో అన్నపూర్ణ రిజర్వాయర్ నింపాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జంకి, ఆగస్ట్ 10: కాళేశ్వర జలాలతో అన్నపూర్ణ రిజర్వాయర్ పంపింగ్ చేసి కాల్వల ద్వారా బెజ్జంకి మండలంలోని చెరువులు, కుంటలు నింపాలని బీఆర్ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మాజీ ఎంపీపీ లింగాల నిర్మలాలక్ష్మణ్ నివాసంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో అన్నపూర్ణ రిజర్వాయర్‌ను కాళేశ్వర జలాలతో నింపి కాల్వల ద్వారా మండలంలోని చెరువులు, కుంటలు నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అర్హులైన రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, ఎరువుల కోసం సైతం రైతులు క్యూలో నిల్చునే పరిస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా అభివృద్ధిపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, కచ్చు రాజయ్య, ఎం.తిరుపతిరెడ్డి, మల్లేశం, నరేష్, బిగుళ్ల మోహన్, బిగుళ్ల దుర్గసుదర్శన్, పొట్ల పల్లి శివకృష్ణ, బోనగిరి నవీన్, లింగాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## సైక్లింగ్ సంఘం సంయుక్త కార్యదర్శికి సన్మానం

శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి

సిద్దిపేట కమాన్, ఆగస్టు 10 : వ్యాయామ విద్య ఉపాధ్యాయులుగా సుదీర్ఘకాలం పాటు సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండారుపల్లి శ్రీనివాస్‌ను ఆ సంఘం నాయకులు శనివారం సన్మానించారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యద